

# మనసు చేసిన గారడీ

రాధ వీధిలోకి వచ్చినుంచుంది. వీధి గేటు పట్టుకుని తొంగిచూచింది. గంట అయిదుకి రెండు నిమిషాలు. ఎప్పుడనగా వస్తానన్నారీ పెద్దమనిషి. నాలుగున్నరకి. వచ్చి సినిమాకి తీసికెడతానన్నారు. ఏదీ? అయిదవుతున్నా అయిపు లేరు ఎప్పుడూ ఇంతే ఈయన! అసలు తనదే బుద్ధితక్కువ. ఆయన్ని నమ్మడమేమిటీ ? ఆలోచనల్లో పడిపోయింది రాధ. అయినా ఈ భారత దేశంలో భార్య


ఉమాశశి

అందరూ ఇంతే. మొగుడ్ని ఇట్టె నమ్మే స్తారు...ఛ...ఛ...మరీ బుద్ధి తక్కువై పోతోంది మరీను. మళ్ళీ తొంగి చూచింది... అబ్బే . అప్పుడే ఎక్క డొస్తారు... అదుగో... ఆ ఎదురింటా విడ మొగుడు ఠంచన్‌గా అయిదుకి ఇంటికి వచ్చేశాడు... ఎంత అదృష్టం ఆవిడది. అందుకే ఆవిడకా విర్రవీగుడు.. అవునుమరి...చెప్పినట్టు వినే మొగుడు.. ఆడిస్తోంది, కీలు బొమ్మలాగ. అయినా మరీ అలా ఆడిస్తే ఆడేమొగుడూ ఒక మగాడేనా. అబ్బే...ఛీ... అసహ్యంగా వుంటుంది. ఏం బావుండదు. అదేమిటీ ? ఆయన మళ్ళీ వెళ్ళిపోతున్నాడు, ఎక్క డికో. రాకెట్ చేతిలోకి తీసుకుని వెళ్ళు తున్నాడు.అంతే ఇంక మళ్ళీఎప్పటికో... ఇంతేనా ? పాపం... అవిడఎంత బాధ పడుతోందో... పట్టుమని పదినిమిషాలేనా ఇంట్లోవుండని మొగుణ్ణి ఏంచెయ్యాలి?ఏం చెయ్యాలి? చెవులు మెలేసి ఇంట్లో కూర్చో బెట్టాలి. బావుంటుందా అలాచేస్తే? చెట్టంత మొగాణ్ణి పట్టుకుని చెవులు మెలెయ్యడం ఏం బావుంటుంది ? ఏంచెయ్యాలి? ఖర్మ. ఏదో ఒకటిచేస్తే సరి. ఆవిడ ఖర్మ ఆవి డది, ఇంతకీ ఈయన ఇంక రారా? వాచీ చూసుకుంది. అయిదు గంటల అయిదు నిమిషాలు... అయిదు నిమిషాలయిందా అప్పుడే...లేదు... ఇంకా నాలుగు నిమి షాలే. అయినా మరోనిమిషం అవడం ఎంత సేపు. 'ఏమయినా సరే. ఆయన వచ్చేదాకా గేటువదలను' అనుకుంది, రాధ.

అది కొంచెం పెద్ద వీధయినా, రద్దీ తక్కువగా వుంటుంది. రాధ చూపు తనకు కొంచెందూరంలో నుంచుని వాసన చూసుకుంటూ చిన్నచిన్నగా నడచి వస్తున్న కుక్కపిల్ల మీద పడింది. ఛీ... గజ్జికుక్క... ఎప్పుడూ ఇక్కడే తిరుగుతూ వుం టుంది...అసహ్యంగా... ఛీ .. గట్టిగా 'ఛీ' అన్నదేమో. ఆ కుక్కపిల్ల తలెత్తి రాధను చూచింది. ఎంతజాలిగా వున్నాయి ఆ కళ్ళు...పాపం...చిన్నకుక్కపిల్ల... గజ్జి ఒళ్ళంతా...అబ్బ...ఒళ్ళు ఝల్లు మంది రాధకు. ఆమె స్నేహితురాలు సుందరి, ఏది చూచినా కవిత్వం చెబుతా ననేది. కుక్కపిల్ల సబ్బుబిళ్ళ, అగ్గి పుల్లా... కాదేదీ కవితకనర్హం అంటూ శ్రీశ్రీని గుర్తుచేసుకునేది. ఈ కుక్క పిల్లని చూస్తే సుందరి కవిత్వం చెబు తుందా?

దగ్గరకు వచ్చింది కుక్కపిల్ల. 'ఛీ... పో' కసిరింది రాధ. కొంచెం దూరంగా పోయింది అది. పక్కఇంటి చిన్న అరుగుక్రిందకుపోయి తననే చూస్తూ తోక ముడుచుకు పడుకుంది. నవ్వుకుంది రాధ ఎందుకంతలా చూస్తుంది అది?

పక్కింటివారి పెంపుడుకుక్క 'టామీ' వీధిలోకి వచ్చింది. దానివెంట




పక్కింటి ఇల్లాలూ ఇవతలకి వచ్చింది. రాధను పలకరించింది.

"ఏమిటీ ఇక్కడ నుంచున్నారూ?"

పట్టుచీర గరగర ద్రమ్ముకు చుట్ట బెట్టినట్లువుంది.

"ఆ...వారికోసం". నవ్వుతూ అంది రాధ. పైకే ఆ నవ్వు. లోపల మండింది. ఈవిడకెందుకో? పెద్దబొజ్జ... టున్ టున్‌లావుంది. ఎప్పుడూ మేకలాగ ఏదో నవులుతూ వుంటుంది.

"అయ్యో! ఎదురుచూడటం ఎందుకు? రాలేరా ఇంటికి? శుభ్రంగా లోపలకి వెళ్ళి విశ్రాంతి తీసుకోండి" అందావిడ ఏవో నోట్లోవేసుకుని లోపలకుపోతూ. ఉచిత సలహా ఒకటి పారేసింది. నిజమే! ఎప్పుడూ విశ్రాంతి తీసుకుంటే ఆవిడలాగే గున్న ఏనుగులా తయారవవచ్చు...

అరుగుక్రింద పడుకున్న కుక్కపిల్లనుచూచి టామీ మొరిగింది. ఆలోచనలో పడిపోయింది. రాధ మళ్ళీ గేటును వదలదలుచుకోలేదు.

టామీ మొరుగు విన్న గజ్జికుక్క కూడా మొరిగింది. ఇంత చిన్న కుక్కపిల్లలేదు. ఎలా టామీ మీద తిరగబడుతోందో! గొంతుకూడా పెద్దదవుతోంది. టామీతో సమానంగా అరుస్తోంది. ఇంకా టామీ వెనక్కి తగ్గుతోందా? లేదు. కానీ గజ్జికుక్క టామీని బాగా పట్టుకుంది. దాని బలంముందు టామీ విలవలేకపోతోంది. తిరగబడదేం? బలంగావుంది కదా! కానీ గజ్జికుక్కకి ఇంకా ఎక్కువ బలం వున్నట్లుంది. బలేగా పోట్లాడు

తోంది. కరిచేసింది టామీని. కుయ్యో. మొర్రో మంటూ టామీ లోపలికి పారిపోయింది. ఇంతేనా టామీ ప్రతాపం? పెద్ద సింహంలావుంది చూడటానికి. అలంకారపుష్టి నైవేద్యనష్టి. ఆ గజ్జికుక్క వేగంగా పోతోంది. అలా పోతూ దారి కడ్డంగావున్న ఒక చిన్నపిల్లని కరిచేసింది. ఇదేమిటీ? దారేపోయే వాళ్ళందర్నీ కరుస్తోందా ఈ కుక్క! పోతోంది పరిగెత్తుకుంటూ. అదుగో ఆయన ... ఆయనే...ఎదురువస్తున్నారు? ఆయన్ని పట్టుకోదుకదా! నిజమే! పట్టుకోదుకదా! అయ్యో అయ్యో పట్టుకుంది. కరిచేసిందా? ఏమీటీ ఆయన బాధతో వంగారు ముందుకు. వెధవకుక్క కరిచేసింది.

"తప్పుకోండి, వచ్చెయ్యండి, వచ్చెయ్యండి" అరుస్తోంది రాధ.

"రాధా! ఏమిటా అరుపు?"

"ఆ..." తెప్పరిల్లింది రాధ...

ఎదురుగా వేణు నుంచున్నాడు సైకిల్ పట్టుకుని.

"మీరేనా? మీరేనా?" తలవిడిలించి చూచింది రాధ ఆయనే... అమ్మయ్య... ఏవిటిదంతా? కరవలేదూ కుక్క? ఏదో ప్రశ్న వేయబోతున్న రాధని వారించి,

"ఏమిటది? లోపలికి పద! అడ్డంలే... సైకిల్ లోపలపెట్టాలి" విసుగ్గా అన్నాడు వేణు పక్కకు తప్పుకుంది రాధ.

తనది కలా? నిద్రపోయిందా తను ఆ గేటు దగ్గర? లేక పగటికలా? పక్కింటి అరుగుమీదకు తొంగిచూచింది. అక్కడే పడుకునుంది గజ్జి కుక్కపిల్ల. అయితే టామీకి, దీనికి ఏ పోట్లాటా జరగలేదా? అంతా తన ఊహేనా? పోనీలే బాబూ! ఎంతభయపడింది. కుక్కపిల్ల కళ్ళెత్తిచూసింది రాధను. ఇంకా ఈవిడ ఇక్కడేవుందా అనుకుందా అది?

"ఏమిటి రాధా? లోపలకు రావా? ఏమయింది నీకు ఇవ్వాళ" లోపల్నించి వేణు అరిచాడు.

విసవిసా లోపలి కెళ్ళింది రాధ.

"ఏమిటి మీరు? పొద్దున్న మీరు చెప్పిందేమిటీ? సినిమాకు తీసుకెడతాననలేదూ?"

విసురుగా అడిగింది రాధ.

"ఇప్పుడుమాత్రం కాదన్నానా?" అడిగాడతను.

"ఎంత టైమయిందో తెలుసా మీకు?"

"ఎంతయిందేం? అయిదూ పదేగా? బోలెడు టయిముంది...పద...పద ... త్వరగా తెములు" అన్నాడతను మొహం కడుక్కోవడానికి వాష్‌బేసిన్ దగ్గర కెడుతూ.

గబుక్కున వాచీ చూసుకుంది రాధ. అయిదూ పది. నిజమే! అంతేనా అయింది!

కాలానికి కళ్ళెం మనసుకు గొళ్ళెం లేదు. ఇందుకేగాబోలు! అనుకుంది రాధ తెల్లపోతూ!